రేఖాచిత్రం

జె.వి. సుబ్బలక్ష్మి

మెడలో నల్లపూసల గొలుసుతో పాపట్లో కుంకుమతో అరుంధతిలా ఆఫీసులో అడుగు పెట్టిన అనూరాధను చూడగానే ఆఫీసు స్టాఫంతా బిత్తరపోయారు. ఏమిటీ మార్పు ఒక్కసారిగా అనుకున్నారు. పోయిన సారి నేను ఆఫీసుకు చివరిసారిగా వచ్చినప్పుడు తల ఓరగాపెట్టి మెడ వాల్చి కళ్ళు పక్కకు తిప్పి ఓర చూపులు చూచిన వాళ్ళంతా ఈ రోజు తలెత్తి ధైర్యంగా పాపం చేయని వాళ్ళు గుళ్ళో దేవతను చూచినట్లుగా చూస్తున్నారు. అంతవరకూ వాళ్ళ చూపులు ముళ్ళయి గుచ్చుకుని బాధపెట్టేవి అనూరాధను. ఈ రోజు ఆ చూపులే చల్లగా వెన్నెలలా తగులుతున్నాయి. ఆత్మీయుల చూపుల్లా ఆహ్లాదాన్ని కలిగిస్తున్నాయి. అనూరాధ వెళ్ళి తన సీట్లో కూర్చోగానే పక్క సీట్లో విమల తన కుర్చీని అనూరాధకు దగ్గరగా లాక్కుంది.

"ఏమిటి అనూ? నిజంగా.. నమ్మలేకుండా వున్నాను స్మీ" అంది చిన్నగా అనూరాధకు మాత్రమే వినిపించేట్లుగా.

"ఏముంది. పెళ్ళి చేసుకున్నాను" అంది అనూరాధ సింపుల్‌గా.

"అదే ఇంత త్వరగా ఎవరికీ చెప్పకుండానే" అంది విమల.

"తల్లీ మీకందరికీ చెబుతూ ముహూర్తాలు పెట్టించి శుభలేఖలు అచ్చు వేయిస్తూ కూచుంటే కుదిరిన సంబంధం కాస్త వెనక్కు వెళ్ళేది. అంతా చాలా సడన్‌గా జరిగిపోయింది. మెడలో నల్లపూసలు, పాపట్లో కుంకుమ లేకుంటే నేను కూడా జరిగిందంతా కలనే అనుకునేదాన్ని"

"నీ పెళ్ళికథంతా ఓ పెద్ద మిస్టరీలా వుంది. దయచేసి త్వరగా చెప్పవే చంపక"

తల్లీ చెప్పాలంటే ఓ పెద్ద నవలవుతుంది. సాయంకాలం యింటికిరా. నీకు వివాహపర్వం అంతా వినిపిస్తాను. విని తరిద్దువుగానీ."

"సరే అలాగే కానీ. అంతకన్నా ఈ జన్మకు కావలసిన భాగ్యమింకేముంటుంది. నేను వెళ్ళి పార్టీ అరేంజి చేయిస్తాను. నువ్వు కనీసం మీ ఆయన వూరూ పేరయినా చెప్పు. కొలీగ్సుకి చెప్పవద్దూ?"

"పేరు శచీంద్రనాథ్ ముఖర్జీ. ఊరు..."

"కలకత్తా" అని పూర్తి చేసింది విమల.

"నీకేలా తెలిసిందీ"

"ఏముంది. ముఖర్జీలు కలకత్తావాళ్ళే గానీ ఇక నేవెళ్ళి పార్టీ అరేంజి చేయిస్తాను. ఇన్నాళ్ళకు పెళ్ళి చేసుకున్నావు. పీనాసి తనం చూపక ఓ యాభై నీవి కావనుకో"

"అలాగే కానీ. నీ పుత్సాహం ఎందుక్కాదనాలి. యాభై నావికావు. మా ఆయనవి సరేనా" అంది అనురాధ నవ్వుతూ.

"అమ్మ దొంగా ఇప్పట్నుంచే మీ ఆయన డబ్బుమీద అధికారం వచ్చేసినట్లు మాట్లాడేస్తున్నావే. సర్లే కానీ అలాగే మీ ఆయన వుద్యోగం జీతం కూడా చెప్పవే తల్లీ నీ ప్రాణ స్నేహితురాల్నని చెప్పుకుంటుంటానుగా. నా పరువు తియ్యకు"

"ఉద్యోగం అక్కడే ఓ కంపెనీలో, జనరల్ మానేజర్, జీతం నెలకు మూడు వేలు. చాలా"

"చాలే తల్లీ. ఇప్పటికి చాలు. నీ పెళ్ళయిందంటే నాకెంత సంతోషంగా వుందో చెప్పలేను." అంటూ అక్కణ్ణుంచి జారుకుంది విమల.

ఆఫీసరుతో సహా అందరూ పార్టీ అందుకుని అనురాధను అభినందించారు.

"ఈ పార్టీ చాలదమ్మా. ఈ సారి మీ ఆయనతో వచ్చి మంచి పార్టీ యివ్వాలి. గ్రాండ్‌గా డిన్నర్ యివ్వాలి సారి" అని ఆఫీసరుగారు అభిమానంగా ఆజ్ఞాపించారు.

"అలాగేనండీ" అంది సిగ్గు పడుతూ అనూరాధ.

ం ం ం

"చెప్పా పెట్టకుండా యీ పెళ్ళి చేసుకోవడమేమిటి" అంది జానకమ్మ "పెద్ద ముండను, తల్లి ముండను నేను బతికే వున్నానుగదా. ఆ రిజిష్టరు పెళ్ళో ఏదో నా కళ్ళముందే చేసుకుంటే ఏం బోయింది. ఏదో చేసుకున్నావే అనకో కనీసం అల్లుడినైనా వెంట పెట్టుకు రాక పోలివి. అడిగిన వాళ్ళు మా అమ్మాయి పెళ్ళి చేసుకుందీ అంటే అల్లుడుగారెప్పుడొస్తారు అని అడుగుతున్నారు. ఎంతయినా ఉన్న ఊరూ వున్న ప్రజాన్నూ"

"ఆయనకు సెలవు దొరకదమ్మా. పెద్ద వుద్యోగమాయె. వాళ్ళ ఆఫీసు ఢిల్లీలో వుంటాడు. ఆయనకు రాని సెలవు తెప్పించుకోవాలి. పెళ్ళిరోజే ఒక్క గంటకన్న ఎక్కువ టైము దొరకలేదాయనకు"

"కాక కాక పిల్ల పెళ్ళయిందంటే అమ్మాయినీ అల్లుణ్ణీ నాలుగు రోజులు అట్టే పెట్టుకునే అదృష్టం నాకు లేదు. ఏక్షణాన మీ ఆయన వచ్చి నా భార్యను నా వెంట పంపండి అంటాడో కలకత్తా అంత దూరం నువ్వెళ్ళి పోతే నేనొక్కదాన్ని యీవూళ్ళో . ."

"ఊరుకోమ్మా? నిన్ను ఒంటరిగా వదిలి ఎందుకెళతాను. ఆయన సంగతి నీకు తెలియదు. తల్లి లేని ఆయన నిన్ను తల్లిలా చూచుకుంటారు. నా మాట నమ్ము. నీ మనవళ్ళనూ మనవరాళ్ళనూ నువ్వే ఆడించుకోవచ్చు. సరేనా"

"నా తల్లే-నీ కడుపు చల్లగా ఎంత చల్లటి మాట చెప్పావే. నీ మాట చాలు

నాకు పది వేలు-కొత్త కాపురం కాస్త సర్దు కున్నదాకా వుండి తిరిగి వచ్చేస్తా. ఈ వూళ్లో నాకేం తక్కువ. కాలూ చెయ్యీ అందినన్నాళ్ళూ చేసుకుంటాను. ఆ తర్వాత ఎలాగూ నీ దగ్గరికి రాక పోతానా."

అప్పుడే అప్పగింతలు పెడుతున్న తల్లిని చూచి నవ్వుకుంది అనూరాధ. పిచ్చి అమ్మ. కూతురి పెళ్ళంటే యింత ఆనందంతోపాటు ఎంత దిగులో అను కుంది.

"ఏమే కొత్త పెళ్ళికూతురా! ఏమి టంత దీర్ఘాలోచనలో వున్నావ్. పర ధ్యాన మెక్కువైందే" అంటూ ప్రవేశిం చింది విమల.

"నేనా! నువ్వే-ఆనాడు వస్తానన్న దానివి యిప్పుడా రావడం ఐదురోజుల తర్వాత. చూడుము వివాహ పర్వంబు వినుటలో నాలసించినందున నీకు సం పూర్ణ ఫలంబు దక్కకుండుగాక."

"తల్లీ! ఆ ఫలమేదో పూర్తిగా నీకే దక్కనీ, నాకు ఫలమూ వద్దు, పండూ వద్దు. పురాణ శ్రవణానికి ముందే ఫల శ్రుతి విన్పించిన నీ తెలివిని ఎలా అభి నందించాలో తెలీకుండా వుంది. ఇహ నీ ప్రేమాయణం పెళ్ళాయణం అంతా చెప్పు."

అనూరాధ లోపలికి వెళ్ళి స్వీటూ హాటూ తెచ్చింది.

"ఇదుగో యిది తీసుకో-అమ్మ చేసింది" అంది.

విమల స్వీటూ హాటూ తిన్నాక యిద్దరూ కాఫీ తాగారు.

"పద అలా తోటలోకి వెళ్దాం" అంది అనూరాధ.

ఇద్దరూ కుర్చీలు తీసుకెళ్ళి తోటలో వేసుకున్నారు.

నేను హైస్కూల్లో చదివేప్పుడు నాకో స్నేహితురాలుండేది. పేరు రాధిక. ప్రాణ స్నేహం మాది. పోటీలు వేసుకొని చదివే వాళ్ళం. అది ఎస్సెల్సీ ప్యాసు కాగానే పెళ్ళి చేసుకుంది. దాని మొగుడో పెద్ద బిజినెస్ మాగ్నెట్. కలకత్తాలోవున్నాడు. ఇన్నాళ్ళకు నేను గుర్తుకు వచ్చానట. అర్జంటుగా రమ్మని వుత్తరం రాసింది. వెళ్ళాను. దాని మొగుడికి స్నేహితుడే యీ శశీంద్ర. పరిచయమయ్యాడు. మా పరిచయం కొద్ది రోజుల్లోనే...."

"ప్రేమగా మారింది. పెళ్ళి చేసు కున్నావ్, బాగుంది, ఎలాగైతేనేం ఓ యింటి దానివయ్యావు. మీ ఆయన యెప్పుడు వస్తాడే యిక్కడికి?"

"ఏమో! ఓ ఆర్నెల్లయినా పడు తుందిట."

"ఎక్కడి జడ పదార్థమే అనూ. కొత్తగా పెళ్ళయిన వాడు, ఆర్నెల్లెలా వుంటాడు నిన్నువదిలి"

"ఈ జడ పదార్థాన్ని చేసుకున్న వాడు జడ పదార్థంగాక మరేమవుతాడు" అంది అనూరాధ నవ్వుతూ, ఎవరేమన్నా పులుక్కుండా పలక్కుండా వుండే అనూ రాధకు ఆఫీసులో అంతా జడ పదార్థం అని పేరుపెట్టుకున్నారు.

"పోనీలే వర్ణించనయినా వర్ణించు, విని తరిస్తాను," అంది విమల.

"నల్లని వాడు పద్మనయనంబుల వాడు కృపారసంబుపై జల్లె...."

"జల్లెడా లేదు తప్పేటాలేదు. పనికి

మాలిన వర్ణనా నువ్వూను, ఓ ఫొటో వుంటే యిలా యివ్వు-నేనే వర్ణించు కుంటాను."

అనూరాధ లోపలికి వెళ్ళి ఫ్రేంలో తన పక్కనవున్న అతని ఫోటోను తెచ్చి చూపించి.

"ఎలా వున్నారు."

"మూడు మూర్తులా నీకు తగ్గటు వున్నాడు. ఈడూ జోడూ చక్కగా కుదిరింది. నిజం చెప్పాలంటే నీ కన్నా కూడా మీ ఆయనే అందంగా వున్నాడు, కాదంటావా?"

చిన్నగా నవ్వి వూరుకుంది అనూరాధ.

"మీ అమ్మ ఏమంది అల్లుణ్ణి చూసి"

"అమ్మ కూడా అల్లుణ్ణి చూడ లేదింకా. ఫోటో చూసింది."

"మరి నువ్వు వుద్యోగంలో వుంటావా మానేస్తావా"

"మా ఆయన నన్ను తీసికెళ్ళే దాకా చేస్తాను. ఆ తర్వాత ఎలాగూ మానేస్తా"

"లక్కీ ఫెలోవి" అంది విమల మనస్ఫూర్తిగా, "ఇంక వెళ్తానే యింటి దగ్గర పిల్లలు ఎదురు చూస్తుంటారు."

కమలను గేటుదాకా సాగనంపి ఫోటో చేతోపట్టుకుని వచ్చింది అనూరాధ.

"మీ ఫోటో చూస్తుంటేనే నన్ను నేను మర్చిపోతుంటాను. మీరే స్వయంగా నా దగ్గరికి వస్తే....అమ్మ అల్లుణ్ణి చూడాలని ఆతృత పడుతోంది" అనుకుంది ఫోటోను చూచి భారంగా నిశ్వసిస్తూ.

○ ○ ○

"అమ్మా! మీ అల్లుడి దగ్గర్నుంచి వుత్తరం వచ్చిందే" అనూరాధ.

"ఏం రాశాడో చదువు" అంది జానకమ్మ కండ్లద్దాలు సవరించు కుంటూ ముందున్న చాట పక్కన పెట్టి.

"రమ్మని రాశారు. రేపట్నుంచే పదిహేను రోజులు సెలవు పెట్టి వెళ్తున్నాను, నిన్ను గూడా తీసికెళ్దామను కున్నాను గానీ అక్కణ్ణుంచి ఆయన ప్రోగ్రాం ఏమిటో తెలియదు. అనవసరంగా నీకు హైరానా ఎందుకని...."

"సవ్వు పోయిరా మరి నాదేముంది, వచ్చేప్పుడు యిద్దరూ రండి. చిన్నగా వీలు చూచుకుని ఒక్కసారి వచ్చి పొమ్మను."

"అవునమ్మా చెప్పాలి. ఆ తర్వాత ఆయన ఫారిన్ వెళ్తారేమో" అంది అనూరాధ.

పదిహేను రోజులుంటానన్న అనురాధ వారం రోజులు కాగానే తిరిగి వచ్చింది. వస్తూ వస్తూ కొత్త చీరలు, బొమ్మలు యింకా చాలా వస్తువులు తెచ్చింది.

స్నానం చేసి చీర మార్చుకుని వచ్చి తెచ్చిన వస్తువులన్నీ బీరువాల్లో సర్దింది.

ఈసారి గూడా అల్లుడు రాలేదేమిటా అనుకుంది జానకమ్మ.

వంటింట్లోకి వెళ్ళి పీట వాల్చుకుని కూర్చుని "ఆయన అర్జెంటుగా కంపెనీ పని మీద అమెరికా వెళ్ళాల్సి వచ్చింది. అందుకే నేను వచ్చేశాను, కాఫీ యివ్వు" అంది అనూరాధ.

వెళ్ళయ్యాక అనురాధ ఖరీదైన చీరలు కడ్తోంది. మనిషి చాలా వుత్సాహంగా కన్పిస్తోంది. నాలుగు నెల్లకొసారి కలకత్తా వెళ్ళి వస్తోంది. సెలవు దొరక్క శలీంద్ర యింతవరకూ ఆంధ్రా రాలేదు. ఈసారి ఫారిన్ వెళ్ళడం వల్ల ఇంకో

రెండేండ్లు దాకా రాడు అని చెప్పింది అనూరాధ.

ఫారిన్ వెళ్ళాక శచీంద్ర దగ్గర్నుంచి ఉత్తరాలు తరచు రావటంలేదు. అనూరాధ వుద్యోగం మానలేదు. తల్లి అడిగితే "ఆయనకు పని ఎక్కువగా వుంటుందమ్మా అంతే. దూరదేశాన వున్నారాయె. అయినా తడవ తడవకూ రాయడానికేముంటుంది" అంటుంది అనూరాధ. అస్తమానూ శచీంద్ర ఫోటో దగ్గర పెట్టుకుని ఆలోచనల్లోకి జారిపోయిన కూతుర్ని చూసి నిట్టూర్చేది తల్లి. చిలకా గోరింకల్లా వుండాల్సిన రోజుల్లో యీ ఫారెన్లు ఏమిటోనని, అక్కడికి వెళ్ళి వచ్చాక శచీంద్ర జీతం పెరుగుతుందట. మూడు వేలకన్నా ఎక్కువ జీతం మనిషి కెందుకు. హాయిగా వుద్యోగం మానేసి యిదికూడా అక్కడికి వెళ్ళగూడదూ అనుకుంది జానకమ్మ, అప్పుడప్పుడూ విమల వచ్చి వెడుతూ వుంది. విమల దగ్గర తన గోడు వెళ్ళ బోసుకుంది జానకమ్మ.

"పర్వాలేదు పిన్నిగారూ, ఈ కాలంలో ఫారిన్ వెళ్ళకుంటే గొప్ప లేదు. మీ అల్లుడు ఫారిన్ రిటర్న్డ్ అంటే మీకు మాత్రం గొప్ప కాదూ, రెండేళ్ళగా ఎంతలో తిరిగివస్తాయి" అని ఓదార్చింది విమల.

ం ం ం

ఓ సంవత్సరన్నర గడిచింది. ఈ సంవత్సరన్నరకూ శచీంద్ర దగ్గరుంచి మూడుత్తరాలు వచ్చాయి మొదటి ఆరు నెలల్లో, ఆతర్వాత వుత్తరాలే లేవు. సంవత్సరన్నర గడిచిన తర్వాత ఓరోజు అనూరాధ దిగులుగా యింటికి వచ్చింది. బాగ్ అవతల పడేసి మంచం మీద వాలిపోయింది. అనూరాధ మనసంతా అల్లకల్లోలంగా వుంది. కన్నీరు దిండును తడిపేస్తోంది.

కూతురు ఎంతకూ గదిలోంచి రాకపోయేసరికి జానకమ్మ వచ్చింది. "ఏమిటే తల్లీ అలావున్నావు, ఒంట్లో బాగులేదా" అంది ఆదుర్దాగా కూతుర్ని భుజాలు పట్టుకుని తనవేపు తిప్పుకుంటూ కన్నీళ్ళు చూడగానే ఆమె మాతృహృదయం ద్రవించింది.

"ఏమైందే? ఎందుకా కన్నీళ్ళు? అల్లుడి దగ్గర్నుంచి వుత్తరం రాలేదనేగా! వస్తుందిలే" అంది అనునయంగా.

"ఉత్తరం వచ్చిందమ్మా" అంది అనురాధ నిర్లిప్తంగా.

"వచ్చిందా! మరయితే యింక ఏడుపెందుకూ, ఇంత దిగులు పడేదానివి అతణ్ణి విడిచి వుండట మెందుకు, వెంటనే వచ్చేస్తున్నానని జాబు వ్రాయి" అంది జానకమ్మ.

"అమ్మా యిదేం కలకత్తా కాదు. వున్న పళంగా రైలెక్కి వెళ్ళిపోడానికి అమెరికా"

"అయితే విమానమెక్కి పోలేవూ. అంతేగా"

"అది కాదమ్మా, ఇక్కణ్ణుంచి ఎవరైనా విదేశాలకు వెళ్ళాలంటే ప్రభుత్వం అనుమతికావాలి"

"అదేమిటే నీమొగుడి దగ్గరికి నువ్వు పోడానికి ప్రభుత్వం అనుమతి ఎందుకూ" అంది జానకమ్మ ఆశ్చర్యంగా.

"ఇప్పుడింక ఆయన అనుమతే లేదులేమ్మా" అంది అనూరాధ. జానకమ్మ



అదిరి పడింది.

"అదేమిటీ? ఏమైంది? ఏముంది ఆ జాబులో. అల్లుడుగారు క్షేమమేగా" అంది.

"ఆఁ! క్షేమమే! ఆయన...ఆయన... వేరే పెళ్ళి చేసుకున్నారమ్మా" అంది అనూరాధ వెక్కుతూ.

"ఏమిటే! నిజంగానే! ఆరి భగ ్గంతుడా" జానకమ్మ ఉన్నచోటనే కూలి ్గడింది. పిల్ల కాపురం సవ్యంగా వుండా లనుకుంటే యిదేం ఘోరం మధ్యలోనే. అందుకే చెప్తూనే వున్నా పెళ్ళి దగ్గ రుండవే పిల్లా అని, మగవాడిబుద్ధి ఎప్పుడెలా మారుతుందో. కలకత్తాలో వున్నన్నాళ్ళూ బుద్ధిగానే వుండె. ఓ వెన్నెల వినిన కర్ర ఒళ్ళోనూ పడకపాయె. నువ్వు దగ్గరుంటే యీ దుర్బుద్ధి పుట్టునా"

"ఉద్యోగం...."

"వెధవ్వుద్యోగం. ఏడు వందల రూపాయల ఉద్యోగం ఒహ లెఖ్ఖా-మీ ఆయన....మీ ఆయన మూడు వేలు సంపాదిస్తుండగా. తని కూర్చోలేక యిదేం దుర్బుద్ధే. తాళి కట్టించుకున్నావు గానీ ఒక్కనాడైనా దగ్గరున్నావా" అంది జానకమ్మ ఆవేదనగా. పెళ్ళి అయ్యీ కాకుండానే కూతురి కాపురం కూలి పోయిందనే సరికి ఆమె బాధను ఓర్చుకో లేకపోయింది. తల్లి బాధను చూడలేక అనూరాధ తోటలోకి పారిపోయింది శశీంద్ర ఫోటోతో సహా.

పిన్నిగారూ అంటూ విమల రాగానే జానకమ్మ భోరున ఏడుస్తూ ఆమెను వాటేసుకుంది. "అనూరాధ జీవితం అడవిగాచిన వెన్నెలైందే తల్లీ. దాని బతుకు బండలైందే అమ్మా" అంటూ.

"ఏమైంది పిన్నిగారూ. సరిగ్గా చెప్పండి" అంది కంగారుగా విమల.

"అయ్యేదేముంది. దాని మొగుడు

అమెరికాలో ఎవత్తో యింగిలీషుముండను కట్టుకున్నాట్ట. నువ్వు నాకక్కర్లేదుఫో అని పుత్తరం రాశాడు. తల్లిగా నేను దానికి వెళ్ళి చెయ్య లేకపోయాను. కనీసం కళ్ళ ఎదురుగా వాళ్ళిద్దరూ చిలకాగోరింకల్లా ఉరుగుతూ వుంటే చూద్దా మనుకున్నా. ఈ ముసిల్దానికంత మాత్రమదృష్టం కూడా లేదేమోనమ్మా.

ఆ ముండ ఎవరోపీక్కి తగులుకుంది నాఖర్మ."

"ఇంతకూ అనూరాధఏదీ"

"ఆ తోటలోకి పోయిందేమో వెళ్ళు తల్లీ. వెళ్ళి దాన్ని కొంచెం ఓదార్చు" అంది జానకమ్మ.

విమల వెళ్ళే సరికి అనూరాధ తదే కంగా శచీంద్ర ఫోటోను చూస్తోంది. విమల వెనకనుంచి ఆ ఫోటోను లాగి విసిరి కొట్టింది. అద్దం పగలి పోయింది. అనూరాధ వెనక్కి తిరిగికోపంగా 'విమలా' అని అరిచింది. కొంత సేపటికి తేరుకొని "ఎంతపనిచేశావె విమలా" అంది.

"నీ హృదయం బద్దలు కొట్టిన వాడి ఫోటో బద్దలు కొట్టాను. తప్పా. అసలు మనిషే కన్పించివుంటే బుర్ర బద్దలు కొడుదును" అంది విమల ఆవేశంగా.

"అంత మాటననే విమలా. ఆయన నా దైవం. నాకు కొత్త జీవితం ప్రసాదించారు"

"ఏమిటి మెళ్ళో నల్ల పూసలు పాపట్లో యింతకుంకుమానా. ఇదేనా కొత్త జీవితం? ఒక్క నాడైనా మీ ఇద్దరూ కలిసి సంతోషంగా వున్నారా? పైగా ఆ మూర్ఖుణ్ణి వెనకేసు కొస్తున్నావా" అంది విమల.

"నీకు తెలియదు. నువ్వూరుకో, నా ఖర్మ యిలావుంటే ఆయనేం చేస్తారు. అమ్మన్నట్లు మూర్ఖురాల్ని నేనే ఆయనకు దూరంగావుంటే నా మీద ప్రేమ ఎలా వుంటుంది" అంది అనూరాధ.

కొంత సేపు కూర్చుని వెళ్ళిపోయింది విమల.

o o o

ఆరాత్రి అనూరాధ గదిలో దూరి తలుపు గడియ పెట్టింది. నిద్ర మాత్రల సీసా తెచ్చి అందులో మాత్రలు ఎంచింది. తల్లి కోసం డాక్టరు రాసిచ్చినవి అవి. పన్నెండు వున్నాయి.

"శచీంద్రా. ఐ లవ్ యూ వెరి మచ్. నా జీవితాన్ని ఓ మలుపు తిప్పావు. నీనుంచి నేను కోరింది యీ నల్ల పూసలు కుంకుమ మాత్రమే. ఇంతకు మించి నా జీవితానికి మరేమీ దొరకదని నాకు తెలుసు. ఈ భాగ్యాన్ని పొందినందుకు నేను చాలా అదృష్టవంతురాల్ని. ఎందరో కన్యలు ఈ మాత్రానికి కూడా నోచుకోక దిక్కులేని చావు చస్తున్నారు. వాళ్ళకంటే నేనే నయం. లోకందృష్టిలో వివాహితను. నాభర్త ఫారిన్‌లో మరో అమ్మాయిని పెండ్లాడాడు. బాధ భరించ లేక నేను ఆత్మహత్య చేసుకున్నాను. ఓహ్! లోకం నుండి బోలెడంత సాను భూతి. నా మరణాన్ని ఎవ్వరూ విమ ర్శించరు. పెండ్లి కాకుండావుంటే బతి కున్న పిల్లను తమ మాటల్తో చంపు తుందీ లోకం. ఆ మాటలు భరించలేక చనిపోతే ఆ పిల్లకు ప్రాణం పోసి మరీ హింసిస్తుంది. పెళ్ళికాని పిల్లలు చనిపోతే

భగ్న ప్రేమికులు, మోసపోయిన వాళ్ళు అని బిరుదులు తగిలించి గేలిచేస్తారు. చనిపోయినా వెనక చెడ్డ పేరును మిగుల్చుకో కూడదు. అందుకే యీ పెళ్ళి," అని శచీంద్ర ఫోటోను చేతు లోకి తీసికొని అగ్గిపుల్ల వెలిగించి అంటిం చింది. కాలిపోతున్న ఆ ఫోటో వంక చూస్తూ అనుకుంది,

"శచీంద్రగా పిలువబడుతున్న ఓ అజ్ఞాతవ్యక్తీ! నన్ను క్షమించు. నాభర్తగా నటించినందుకు నీ ఫోటోకు నా కృతజ్ఞ తలు. నీ ఫోటోను కాల్చానని బాధ పడకు-నా ఆయుస్సు కూడా పోసుకుని పిల్ల పాపలతో చల్లగావుండు. నా పెండ్లి నాటకానికి కలకత్తాలో ఓ స్టూడియోలో దొంగిలించా నీ ఫోటోను. నీకు శచీంద్ర నాధ్ ముఖర్జీగా పేరుపెట్టాను. నీ పేరు మీదుగా మిసెస్ అనూరాధ ముఖర్జీ నయినాను. కన్న తల్లికి కూడా తెలీ నీయకుండా నాటక మాడాను. ఈ నాటకం అయిపోయింది. నా పాత్ర నిష్క్రమిస్తున్నది, ఇక ఈ ఫోటో యిక్కడ వుంటే లేనిపోని అనుమానాలకు ఆస్కారమవుతుంది. అందుకే ఫోటోని కాల్చి సహగమనం చేస్తున్నాను.

"ఏ కారణంగానైనా ఆడపిల్లకో వయ సొచ్చాక పెళ్ళికాకుంటే కాలేదని పొడిచే ఈ సంఘం ఆమె కోసం ఏం చేస్తోంది. చదువుండి, ఆరోగ్యం వుండి, రూపం గుణం కలిగిన యీ అనూరాధకు పెండ్లి కాలేదంటే కారణమేమిటి? గొంతెమ్మ కోరికలు కోరే పెండ్లి కొడుకుల దర్పం కాదా. వింతంతువైన తల్లి ఏ సహాయమూ లేక సరైన ప్రయత్నాల చెయ్యక పోవ డం కాదా, తండ్రి వున్నన్నాళ్ళు యింటి చుట్టూ చేరి ఆయన పోగానే ముఖాలు చాటు చేసిన బంధువుల అభిమానం కాదా. స్నేహితులమంటూ నీ ఎదుట సానుభూతి పలికి వెనక ఏ సహాయమూ చెయ్యని సహాధ్యాయుల నాగరికత కాదా. ఎవ్వరికీ తాము చేసే సహాయం ఏమీ లేకున్నా పెండ్లి కాలేదు అని అది అమ్మాయి అస హ్యతగా వెక్కిరించే లోకుల సంస్కారం కాదా. నాకో తోడు కావాలని నేనూ కలలు గన్నాను. వయసు మళ్ళిన తల్లిని ఏమీ అనలేక మిగతవారికు అసలు సంబంధంలేదు కాబట్టి వాళ్ళనూ విమర్శించలేక నాలో నేను కుమిలి పోలేదూ. పెళ్ళికాని పిల్ల జీవితం తెల్లకాగితంపై పెన్సిలుతో వేసిన రేఖాచిత్రం లాంటిది. ఆ బొమ్మకు చక్కని రంగులు వేస్తే చిత్రం అవు తుంది, లేకుంటే అది యెంత అందమైన దైనా పదిమందీ దాన్ని మెచ్చరు. ఈ రేఖాచిత్రం అందంగా కన్పించినా యిది రంగులు వెలిసి పోయినది.

రేఖాచిత్రం రంగులు వెలిసి పోయింది. అనూరాధ జీవితం సమాప్త మైంది.

మరునాటి వుదయం అనూరాధ మర ణం విన్న అమ్మలక్కలు బోలెడు సాను భూతి కురిపించారు. "ఆ మొగుడు అమె రికాలో ఎవర్తో ఒక ఇంగ్లీషుదాన్ని కట్టు కున్నాడట. పాపం అభిమానం గల పిల్ల ఎలా బతుకుతుంది. కన్నెచావు చావ కుండా పసుపు కుంకుమలతో పోయింది పుణ్యాత్మురాలు...